క్లుప్తంగా

బీజేపీలో పలువురి చేరిక



ములుగు రూరల్: మండలంలోని ఇంచర్లకు చెందిన పలువురు భారతీయ జనతా పార్టీలో చేరగా వారిని బీజేపీ నాయకుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అజ్మీరా ప్రహ్లాద్ ఆహ్వానించారు. శనివారం ఇంచర్ల పంచాయతీ పరిధి ఎర్రిగట్టమ్మ వద్ద గ్రామానికి చెందిన 50 కుటుంబాలు బీజేపీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి అజ్మీర చందులాల్ ఆశాయాలను కొనసాగిస్తానని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ములుగు నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరవేసే విధంగా కార్యకర్తలు నాయకులు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

మా గ్రామాలను జీపీలుగా మార్చండి



వాజేడు: మండల పరిధిలోని గ్రామాలను గ్రామ పంచాయతీగా మార్చాలని కోరుతూ ఆయా గ్రామాల యువకులు ఎంపీడీఓ విజయకు శనివారం వినతిపత్రం ఇచ్చారు. మొరుమూరు పంచాయతీలో 12 గ్రామాలు ఉండగా అభివృద్ధి పరంగా తమ గ్రామాలు వెనుక బడుతున్నాయని తెలిపారు. పెసా గ్రామసభలో ఘణపురం, ఘణపురం కాలనీ, అరుణా చెలపురం, మొట్లగూడెం గ్రామాలను కలుపుతూ కొత్త గ్రామ పంచాయతీ చేయాలని కోరుతూ తీర్మానం చేసినట్లు అందులో తెలిపారు. తమ నాలుగు గ్రామాల్లో సుమారుగా 1000 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు.

గుండెపోటుతో బాలుడి మృతి



హరిచందర్(ఫైల్)

వాజేడు: గుండెపోటుకు గురై వాజేడుకు చెందిన సూత్రపు హరిచందర్ (12) శనివార మృతి చెందాడు. మండల కేంద్రానికి చెందిన హరిచందర్‌కు శుక్రవారం రాత్రి గుండెపోటు రావడంతో వైద్యశాలకు తరలిస్తుండగానే మార్గమధ్యలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బాలుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



వాజేడు: మండల పరిధిలోని పెద్దగొల్లగూడెం గ్రామ పంచాయతీలో శనివారం ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేశారు. గ్రామంలోని అన్ని రహదారుల వెంట బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు రహదారుల వెంట ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచు కోవాలని స్థానికులకు సూచించారు.

గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు



ములుగు రూరల్ : గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు ఈ నెల 16 నుంచి 15 రోజుల పాటు కొనసాగనున్నాయి. శనివారం మండలంలోని జంగాలపల్లి పంచాయతీ పరిధిలో ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ మస్రగాని అనితారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో వంద శాతం పారిశుద్ధ్య పనులు చేపట్టి స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దుకోవాలని, గ్రామస్తులు సహకరించాలని సూచించారు. కార్యక్రమలో పాలకవర్గ సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విష్ణుకు ప్రథమ బహుమతి

టేకుమట్ల: పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించుటలో భాగంగా జిల్లా సైన్స్ డిపార్ట్‌మెంట్ నిర్వహించిన మట్టి వినాయకుల తయారీలో మండలంలోని గర్మిళ్లపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన విష్ణు జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించాడు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి బర్ల స్వామి చేతుల మీదుగా అవార్డు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దొమ్మటి శంకర్, ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్‌ఓ అప్పయ్య



కన్నాయిగూడెం : వైద్య శిబిరం వద్ద పరీక్షలు చేస్తున్న అప్పయ్య

కన్నాయిగూడెం: సీజనల్, వైరల్ ఫీవర్ వంటి వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి అప్పయ్య అన్నారు. మండల పరిధిలోని బుట్టాయిగూడెంలో 15 రోజులుగా విషజ్వరాల బారిన పడి పలువురు మృత్యువాత పడగా శనివారం గ్రామంలో మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలోని కుటుంబాలను విభజించి 40 మంది వైద్యసిబ్బంది 12 బృందాలుగా ఏర్పడి ఫీవర్ కేసులను పరిశీలించారు. గ్రామంలో 217 మందికి ఓపీ చూడగా అందులో 58 మందికి జ్వరం ఉన్నట్లు గుర్తించి వారికి మలేరియా పరీక్షలు చేసినట్లు వైద్య అధికారి అభినవ్ తెలిపారు. గ్రామంలో దోమల మందు పిచికారీ చేయించడంతో పాటు డ్రైడే నిర్వహించి ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ అప్పయ్య మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన ఉండాలన్నారు. 15 రోజులుగా బుట్టాయిగూడెంలో విషజ్వరాల బారిన పడి పలువురు మృతి చెందినట్లు తెలిసిందన్నారు. మృతి చెందిన వారు డెంగీతో మృత్యువాత పడినట్లు ప్రచారం అవుతుందని అలాంటి కేసులు లేవని ఎవరూ భయపడవద్దని తెలిపారు. ఇటీవల మృతి చెందిన కుమ్మరి హేమలతకు సికేమియా ఉందని దాంతోనే ఆమె మృత్యువాత పడిందని తెలిపారు. ప్రైవేట్ వైద్యులు పరీక్షలు చేసి డెంగీ లేకున్నా ఉందంటూ సామాన్య ప్రజలను భయానికి గురిచేయడం మానుకోవాలని హెచ్చరించారు. అనుమతులు లేకున్నా కొంతమంది ఆర్‌ఎంపీలు పరీక్షలు చేసి ప్రజల నుంచి అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిసిందన్నారు. అలాంటి వాటికి పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.కార్యక్రమంలో డాక్టర్ గిరి, మెడికల్ అధికారి అభినవ్, సుమలత, వర ప్రసాద్, సీహెచ్‌ఓ దుర్గారావు, హెచ్‌ఈ సంపత్, ఎస్‌యూఓ నర్సింహారావు, హెల్త్ అసిస్టెంట్లు లక్ష్మణ్, ఓం ప్రకాష్, భాస్కర్, సర్పంచ్ పద్మ, పాల్గొన్నారు.

మంగపేట : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత గురించి వైద్యాధికారి వేణు అవగాహన కల్పించారు. మండలంలోని చుంచుపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని రమణక్కపేటలో శనివారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. 46 మందికి వైద్యాధికారి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. జ్వరంతో బాధపడుతున్న 19 మంది నుంచి రక్తనమూనాలు సేకరించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ శైలజ, హెచ్‌వి ముత్తమ్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): వర్షాకాలం సీజన్‌లో సీజనల్ వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఆలుబాక, మొట్లగూడెం, చిరుతపల్లి గ్రామల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలను నిర్వహించడంతో పాటు రక్త నమూనాలను సేకరించారు. అనంతరం మందులను అందజేశారు. ఈ సంద్భంగా ఆమె గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు



మంగపేట : రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి వేణు



వెంకటాపురం(కె): వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి భవ్యశ్రీ

పంచాయతీ కార్యదర్శుల బదిలీ

- త్వరలో మరికొంత మంది బదిలీకి రంగం సిద్ధం

మంగపేట: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలకు చెందిన పంచాయతీ కార్యదర్శులను వివిధ మండలాలకు బదిలీ చేస్తూ కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం ఉత్తర్వులు జారీ చేసినట్లు మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఆలేటి సుదర్శన్ తెలిపారు. రాజుపేట పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రను వెంకటాపురం(కే) మండలం బీసీ మల్రిగూడేనికి, బ్రాహ్మణపల్లి కార్యదర్శి రాజేందర్‌ను వీఆర్‌కేపురం, తిమ్మంపేట కార్యదర్శి తాటి దేవిప్రియను సూరవీడు, కోమటిపల్లి కార్యదర్శి స్వర్ణను గోవిందరావుపేట మండలం రాంనగర్‌కు, మంగపేట కార్యదర్శి మాలోత్ హీరూను వాజేడు మండలం కొంగాలకు బదిలీ చేసినట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు.

మరో 9 మంది బదిలీకి రంగం సిద్ధం ?

మండలంలోని మరో 9 మంది పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు విస్వసనీయ సమాచారం. వివిధ గ్రామ పంచాయతీలకు చెందిన 14 మంది పంచాయతీ కార్యదర్శులు తాము ఇక్కడ విధులు నిర్వహించలేమని తమను వేరో చోటకు బదిలీ చేయాలని వేడుకుంటు నెల రోజుల క్రితం జిల్లా అధికారులకు లిఖిత పూర్వకంగా వినతిపత్రాన్ని ఇచ్చారు. గత నాలుగేళ్ల నుంచి ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూ చాలీచాలని వేతనాలతో ఉద్యోగం చేస్తున్న తమను కొందరు రాజకీయ పలుకుబడి కలిగిన వ్యక్తులు వారి స్వార్థం కోసం ఒత్తిడి చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు లేని ఇక్కడ తాము విధులు నిర్వహించలేమని తమను జిల్లాల్లో ప్రజా ప్రతినిధులు ఉన్న ఏదైనా మండలానికి బదిలీ చేయాలని వేడుకున్న విషయం విధితమే. ఇదిలా ఉండగా ఒకరిద్దరు మండల స్థాయి అధికారులు వారి సామాజిక వర్గానికి చెందిన స్థానిక రాజకీయ నాయకులతో కలిసి ఎంపీడీఓ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కొందరు సిబ్బందితో కలిసి పంచాయతీ కార్యదర్శులపై పెత్తనం చెలాయించగా విషయం జిల్లా స్థాయి అధికారుల దృష్టికి వెళ్లినట్లు సమాచారం. దీంతో మండలంలో పరిపాలనను గాడిలో పెట్టేందుకు కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిసింది. ఇందులో భాగంగానే పంచాయతీ కార్యదర్శుల కోరిక మేరకు ముందుగా ఐదుగురిని బదిలీ చేసినట్లు సమాచారం.మరి కొన్ని రోజుల్లోనే 9 మంది బదిలీ అయ్యే అవకాశం ఉన్నట్లు విస్వసనీయ సమాచారం.

క్రీడలతో మానసికోల్లాసం

ఏటూరునాగారం: క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని జెడ్పీ కో ఆప్షన్ సభ్యురాలు వలియాబీ అన్నారు. శనివారం స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో 67వ ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడలను నిర్వహించగా ఆమె హాజరై ప్రారంభించారు. అనంతరం స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ రమేష్ మాట్లాడుతూ 6 నుంచి 8వ తరగతి 14 ఏళ్ల విభాగం, 17వ విభాగం చెందిన విద్యార్థులతో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఐదు బాలుర హైస్కూల్స్, నాలుగు గర్ల్స్ హైస్కూల్ నుంచి విద్యార్థులు ఈ క్రీడలలో పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చిన్నబోయినపల్లి హెచ్‌ఎం సారంగపాణి, పీడీలు వెంకటేశ్వర్లు, శ్యామలత, శ్రీనివాస్, కుమారస్వామి, పీఈటీలు స్వరూప, రవి, అవంతిక, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ

కేసీఆర్ చిత్రపటానికి సాష్టాంగ నమస్కారం

ములుగు: సమగ్ర శిక్ష ఉద్యోగులు శనివారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. కేసీఆర్ చిత్రపటం ఎదుట సాష్టాంగ నమస్కారం చేసి పాదాభివందనం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 రోజుల నుంచి నిరాహార దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సహకరించాలని కోరారు. రాష్ట్రంలో పనిచేస్తున్న 22 వేల మంది ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతన స్కేల్ అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు చల్లా భాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సోమిడి కరుణాకర్, ఉపాధ్యక్షులు భూరెడ్డి విష్ణు, కోశాధికారి కుమార్ పాడియా, సభ్యులు చిరంజీవి, లక్కి రవి, దేవేందర్, శ్రీధర్ నాయక్, వెంకటేశ్వర్లు, భిక్షపతి, అనిత, తిరుమల, యశోద, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సీఎం కేసీఆర్ చిత్రపటం ఎదుట సాష్టాంగ నమస్కారం చేస్తున్న ఉద్యోగులు

ఆటో బోల్తా.. ఒకరి మృతి

టేకుమట్ల (రేగొండ): ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడి ఒకరు మృతి చెందిన సంఘటన రేగొండ మండలంలోని జగ్గయ్యపేట శివారు ఎస్సారెస్పీ కెనాల్ వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రేగొండ మండలంలోని వెంకటేశ్వర్ల పల్లికి చెందిన వేముల రవి (60) రైతు పరకాల నుంచి వెంకటేశ్వర్ల పల్లికి ఎరువుల బస్తాలను ఆటోలో తీసుకొస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడటంతో రవికి తీవ్ర గాయాలయ్యాయి. జగ్గయ్యపేటకు చెందిన ఆటో డ్రైవర్ సాంబయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం రవిని ఎంజీఎం ఆస్పత్రికి, సాంబయ్యను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా రవి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. శనివారం మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటాం

ఏటూరునాగారం: అంగన్‌వాడీల న్యాయమైన కోరికలు, సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు అండగా ఉంటామని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు సమ్మక్క భరోసా ఇచ్చారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ముందు శనివారం అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెకు ఆమె హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, పెన్షన్ సౌకర్యం చేపట్టాలని న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేపడితే ప్రభుత్వం వారిపట్ల మీనమేషాలు లెక్కపెడుతుందన్నారు. శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ వారి సమస్యలను పరిష్కరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.



దీక్ష వద్ద నినాదాలు చేస్తున్న సమ్మక్క

మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించాలి



ములుగు రూరల్ : వినాయక నవరాత్రి ఉత్సవాల్లో పర్యావరణహిత మట్టి విగ్రహాలను వినియోగించాలని బరిగలానిపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోషన్న అన్నారు. శనివారం విద్యార్థులకు మట్టి గణపతులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాలతో నీటి కలుషితం ఏర్పడి జలరాశులు అంతరించిపోతున్నాయని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గరిగ లత నర్సింగరావు, ఉపాధ్యాయులు రతన్‌సింగ్, మంద రాజు, అంగన్‌వాడీ టీచర్ ప్రమీల, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల పోరాటానికి ప్రజాసంఘాల మద్దతు

వాజేడు: ఇళ్ల స్థలాల కోసం నిరుపేదలు చేస్తున్న పోరాటానికి ప్రజా సంఘాల మద్దతు ఉంటుందని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేశ్ అన్నారు. మండల పరిధిలోని ఇంటి స్థలాల కోసం పేదలు చేస్తున్న పోరాట కేంద్రాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాటం ద్వారానే ఇంటి స్థలాలు సాధ్యం అవుతాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతీ పేదవాడికి ఇంటి స్థలం ఇచ్చి డబుల్ బెడ్రూమ్ ఇళ్లను కట్టించి ఇవ్వాలన్నారు. పేదలకు ఇంటి స్థలాలు దక్కే వరకూ ఎర్రజెండా అండగా ఉంటుందన్నారు. ఈ పోరాటనికి పూర్తి స్థాయిలో ప్రజా సంఘాలు సహకరిస్తాయని తెలిపారు. ఇంటి స్థలాల కోసం చేస్తున్న పోరాట కేంద్రం వద్దకు తహసీల్దార్ శ్రీనివాస్, పోలీసులు వచ్చి ఖాళీ చేయాలని చెప్పడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, కొప్పుల రఘుపతి, చిట్టిబాబు, చిన్న, దామోదర్, దేవయ్య, కృష్ణబాబు, ముత్తయ్య, సొమ్య, కుమారి పాల్గొన్నారు.



వాజేడు: మాట్లాడుతున్న వెంకటేశ్

ఉపాధి కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం

వెంకటాపురం(కె): యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనగంటి వెంకట్ అన్నారు. మండల కేంద్రంలో డీవైఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం న్విహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను రెండు సార్లు అధికారంలోకి వచ్చినా కూడా విస్మరించిందన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సంజీవ, మండల నా యకులు వెంకటేశ్వర్లు, గుండమల్ల విద్యాసాగర్, నాగేంద్రబాబు, బాబురావు, శ్యామల అనిత, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుడిని చేసిన విద్యార్థులు

వాజేడు : మండల పరిధిలోని నాగారం ఎంపీపీఎస్ విద్యార్థులు శనివారం మట్టి వినాయకులను తయారు చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాఠశాల విద్యార్థులందరూ కలిసి మట్టితో వినాయకుడి విగ్రహాలను చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలాజి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ మట్టి విగ్రహాలను వాడాలని సూచించారు.

వినాయకచవితికి ఏర్పాట్లు పూర్తి

వినాయక చవితి నవరాత్రులు జరిపించడానికి నిర్వాహకులు ఏర్పాట్లను చేపట్టారు. మండల వ్యాప్తంగా ఉన్న 17 గ్రామ పంచాయతీల్లోని పలు గ్రామాల్లో నవరాత్రులను నిర్వహించడానికి ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 18 నుంచి నిర్వహించ తలపెట్టిన నవరాత్రుల కోసం కమిటీ సభ్యులు ఏర్పాట్లను చేపట్టారు.



మట్టి వినాయకున్ని చూపిస్తున్న విద్యార్థులు

వైద్య విద్యార్థికి ఆర్థికసాయం

ఏటూరునాగారం: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం మారుమూల గ్రామానికి చెందిన సపావట్ రేణుకకు ఆర్థిక కష్టాలున్నాయని సాక్షి పత్రికలో ఈనెల 13న ప్రచురితమైంది. ఈ మేరకు ఐటీడీఏ పీఓ అంకిత్ స్పందించి రేణుకకు శనివారం ఐటీడీఏలో రూ. 35వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కేసముద్రం మండలం సప్పిడి గుట్టతండా గిరిజన తండాలో నిరుపేద బీద కుటుంబంలో సపావట్ రేణుక జన్మించింది. సపావట్ రేణుక పదోవ తరగతి వరకు మహబూబాబాద్ లోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదివి ఆ తర్వాత ఇంటర్మీడియట్ కల్వకుర్తిలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలో బైపిసి చదివి 884 మార్కులను సాధించింది. ఆ తరువాత ఎంసెట్ పరీక్షలు రాసి ఎస్టీ కోటాలో 4009 ర్యాంకును సాధించింది. దీంతో సిరిసిల్లలోని ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీలో గత ఏడాది బీఎస్సీ అగ్రికల్చర్ సీటు సాధించింది. తరువాత మూడు నెలల్లో తండ్రి మృతి చెందడంతో ఫీజు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. ఈ విషయం తెలుసుకున్న పీఓ రూ. 35 వేల చెక్కును అందజేశారు. తన చదువుకు సాయం చేసిన పీఓకు ఆమె కృతజ్ఞతలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఓ వసంతరావు, ఎస్‌ఓ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



రేణుకకు ఆర్థికసాయం అందజేస్తున్న పీఓ అంకిత్

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

మంగపేట : మండలంలోని కొత్తమల్లూరు, మల్లూరు బీసీ కాలనీలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను శ్రీ రామకృష్ణ సేవా ట్రస్ట్ చైర్మన్ బాడిష నాగరమేష్ శనివారం పరామర్శించి ఆయా కుటుంబాలకు ఆర్థిక సాయం అందచేశారు. కొత్తమల్లూరుకు చెందిన మంచర్ల నరేష్, హేమలత దంపతుల కుమార్తె చిన్నారి యశ్విత ఇటీవల కడుపునొప్పితో మృతి చెందగా దంపతులను పరామర్శించి రూ.3 వేల నగదు, 25 కేజీల బియ్యం అందచేశారు. అదేవిధంగా మల్లూరు బీసీ కాలనీకి చెందిన పోలోజు చంద్రం ఇటీవల మృతి చెందగా మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి దశదిన కర్మ ఖర్చులకు రూ.3000 నగదును అందచేశారు. పరామర్శించిన వారిలో ట్రస్టు వైస్ చైర్మన్ బాడిష నవీన్, వీరస్వామి, మహేష్, రమేష్ ఉన్నారు.

ములుగు రూరల్: గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామానికి చెందిన చింతకాయల రమ ఇటీవల మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులను సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి సర్వర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యం అందించారు. ఆమె వెంట ట్రస్ట్ సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు. మండలంలోని పొట్లాపూర్‌కు చెందిన ఈక సరోజన, బండారుపల్లి గ్రామానికి చెందిన గడ్డమీది అనసూయలు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. శనివారం ఎమ్మెల్యే సీతక్క ఆదేశాల మేరకు బాధిత కుటుంబాలకు చేయూతనందించారు. పరామర్శించిన వారిలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, బానోత్ రవిచందర్, చాంద్‌పాషా, నూనేటి శ్యాం, దేవిసింగ్, ఎంపీటీసీ సభ్యుడు తిరుపతిరెడ్డి, సర్పంచ్ కుమ్మిత లలిత అంకిరెడ్డి, రాజేందర్, రామక్రిష్ణ ఉన్నారు.

ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన గాడిచర్ల వీరయ్య ఇటీవల మృతి చెందడంతో అతడితో పదో తరగతి చదువుకున్న తోటి స్నేహితులు వారి కుటుంబానికి రూ.18వేలు ఆర్థికసాయం శనివారం అందజేశారు. వారి కుటుంబానికి మనోధైర్యాన్ని కల్పించారు. పరామర్శించిన వారిలో సతీష్, శివుడు, రజిని, కిరణ్, సందీప్ ఉన్నారు.



ములుగు రూరల్: బాధిత కుటుంబానికి బియ్యం అందజేస్తున్న సబ్ రిజిస్ట్రార్ తస్లీమా



ఏటూరునాగారం: బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న స్నేహితులు

బోగస్ ధృవీకరణ పత్రాలు రద్దు చేయాలి



వెంకటాపురం(కె) : బోగస్ ఎస్టీ కుల ధృవీకరణ పత్రాలు రద్దు చేయాలని కోరుతూ శనివారం తహసీల్దార్ నల్లెట్ల సృజన్ కుమార్‌కు ఆదివాసీ నవనిర్మాణ సేన ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ నవనిర్మాణ సేన మండల కార్యదర్శి కుంజా మహేష్ మాట్లాడుతూ ఎస్టీ కుల ధృవీకరణ పత్రాలు అంగట్లో సరుకుగా మారాయని ఆరోపించారు. ఈ విషయం పై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి బోగస్ సర్టిఫికెట్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఆట వస్తువుల పంపిణీ

చిట్యాల: మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ జైరిశెట్టి అశోక్ ఇటీవల సివిల్ ఎస్సైగా ఎంపికైన సందర్భంగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రూ. 10 వేలు విలువ చేసే ఆటవస్తువులు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ గతంలో కార్గిల్ యుద్ధంలో పాల్గొని రిటైర్డ్ అయిన తరువాత సివిల్ ఎస్సైగా సెలక్ట్ అయ్యాయని తెలిపారు.

సర్పంచ్‌కు పరామర్శ

మహాముత్తారం: మండలంలోని స్తంభంపల్లి(పీపీ) సర్పంచ్ జాడి రాజయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని శనివారం గ్రామంలో మండల కాంగ్రెస్ నాయకులు ఆయను పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో పీసీసీ సభ్యుడు బెల్లంకొండ కిష్టయ్య, అధ్యక్షుడు పక్కల సదువలి, కాంగ్రెస్ నాయకులు దుర్గయ్య, వంశీరాజ్, రామగిరి రాజయ్య తదితరులు ఉన్నారు.